

రేణికుంటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



రేణిగుంటలో సభకు హాజరైన ప్రజలు

# కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమైతం

- అభివృద్ధి చేశా.. మరోసారి ఆశీర్వదించండి
- బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సంక్షేమం
- మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్27 : కాంగ్రెస్ గ్యారంటీలను నమ్ముకుంటే గ్యారంటీగా ఆగమవుతామని మానకొండూరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్ హెచ్చరించారు. నియోజకవర్గం, గ్రామాలను ఎంతగానో అభివృద్ధి చేసిన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. శుక్రవారం రాత్రి తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పుడు సంక్షేమం, గ్యారంటీల గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు 50 ఏండ్లు పాలించినప్పుడు ఏమైందని ప్రశ్నించారు. వారి మాటలు నమ్ముకుంటే నట్టేట ముంచుతారని ఎద్దేవా చేశారు. రైతులకు రైతుబంధు వద్దన్న కాంగ్రెస్ నాయకులు ఏ మొఖం పెట్టుకొని రైతులను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం వస్తే గల్లా పట్టుకని నిలదీయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం రాకముందు ఉన్న క్లిష్ట పరిస్థితులను, రేణిగుంటకు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రతి కుల సంఘానికి బిల్డింగ్ నిర్మించానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిందని వృద్ధులు, రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. మరోసారి ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ బోనాలు, బతుకమ్మలు, చేపల వలల పట్టుకుని సభకు తీసుకెళ్లారు. పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. సర్పంచ్ బోయిని కొమురయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ల్యాగాల వీరారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్‌రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలుక ఆంజనేయులు, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



ఊరుతండాలో గిరిజన మహిళలతో ముచ్చటిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



మల్కపేటలో చల్మెడ నిర్మిస్తున్న రామాలయం పనులను పరిశీలిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

# హస్తానికి ఓటేస్తే రాష్ట్రాన్నే ముంచేస్తది

- మూడోసారి సీఎం కేసీఆరే
- ఎత్తయిన గుట్టల మధ్యన ప్యాకేజ్-9 నిర్మాణం అద్భుతం
- ₹3కోట్లతో చల్మెడ కుటుంబం రామాలయం నిర్మించడం హర్షనీయం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

కోనరావుపేట, అక్టోబర్ 27: రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలతోనే కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల ఝూటా మాటలు నమ్మి హస్తానికి ఓటేస్త, రాష్ట్రాన్ని వారు ముంచేస్తారని హెచ్చరించారు. ప్రజలు ఆలోచించి గులాబీ పార్టీకి అండగా నిలిచి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కోనరావుపేట మండలంలోని ఊరుతండాలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తండా గిరిజన మహిళలతో కాసేపు ముచ్చటించారు. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించిందని స్పష్టం చేశారు. ప్రధానంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు, రైతు బీమా, 24 గంటల కరెంట్, పేద విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీలకు కుట్టు మిషన్, వృద్ధులకు దివ్యాంగులకు ఆసరా ఫించన్లు వంటి పథకాలు ఎక్కడా లేవని మహిళలకు వివరించారు. అంతేకాకుండా యువతకు లక్షల ఉద్యోగ అవకాశలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఇవన్నీ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. అనంతరం నిమ్మపల్లి గ్రామంలో నుంచి వెళుతూ బస్టాండ్‌లో ఉన్న బురుజును చూసి మురిసిపోయారు. రజకార్ల పోరాటాలు, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. అప్పటి కాలంలో రాతితో కట్టిన బురుజు చెక్కుచెదరక పోవడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు తివర్ణ పతాకాన్ని బురుజును తీర్చి దిద్దిన తీరును అభినందించారు.

### పర్యాటక కేంద్రంగా మల్కపేట

మల్కపేట గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుకుందామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మల్కపేటలో (చెన్నమనేని రాజేశ్వర్ రావు) రిజర్వాయర్ కట్టపై ₹3కోట్లతో చల్మెడ లక్ష్మీనరసింహారావు నిర్మిస్తున్న రామాలయాన్ని సందర్శించారు. రాతితో కడుతున్న ఆలయ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఏడు ఎత్తైన గుట్టల మధ్యన ప్యాకేజ్-9 నిర్మించడం అద్భుతమన్నారు. ఒక వైపు రామాలయం, మరో వైపు మూడు టీఎంసీలతో జలకళ సంతరించుకున్న ప్యాకేజ్-9తో ఈప్రాంతం మరింత అభివృద్ధి చెందనుందన్నారు. భవిష్యత్‌లో టూరిజం స్పాట్ కానుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో వేములవాడలో రాజన్నను దర్శించుకొని నేరుగా మల్కపేటలో రాముడిని దర్శించుకోనే విధంగా చల్మెడ కుటుంబీకులు ఆలయం నిర్మించడం హర్షనీయమన్నారు. ఇక్కడ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మార్కెఫెడ్ డైరెక్టర్ నర్సయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ మల్యాల దేవయ్య, సర్పంచులు రాములునాయక్, శ్రీనివాస్, వంశీ కృష్ణరావు, ఆరె లత, ఉప సర్పంచ్ దొంతర వేని శ్రీనివాస్, మండల యువజన విభాగం అధ్యక్షుడు ముష్నం జీవనగౌడ్, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, ఆరె మహేందర్, మాజీ జడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్ ఉన్నారు.

# అభివృద్ధి బాగున్నది



పార్టీలో చేరిన యువకులతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

- అందుకే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నాం
- రాయల్ రెడ్డీస్ యూత్ సభ్యులు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో చేరిక

వేములవాడ, అక్టోబర్ 27: రాష్ట్రంలో అభివృద్ధి బాగున్నదని, సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రంలని అన్నివర్గాలకు న్యాయం జరుగుతున్నదని, అందుకే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నామని కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన రాయల్ రెడ్డీస్ యూత్ సభ్యులు స్పష్టం చేశారు. వేములవాడలోని చల్మెడ నివాసంలో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి బోయినపల్లి వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో రెడ్డి సంఘం యువకులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఉద్యోగులు, యువ రైతులు సుమారు 50మంది గులాబీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, కొత్తగా చేరిన యువకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించాలని కోరారు. అనంతరం ఆ యువకులు మాట్లాడుతూ, ఉద్యమ నేత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతోపాటు రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సాధించిన ప్రగతిని గమనించుకుంటూ ఎదిగామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై, బీఆర్‌ఎస్ చేరామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించుకునే క్రమంలో బీఆర్‌ఎస్ కుటుంబంలో భాగస్వామ్యం కావాలని, అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో విదేశీ పెట్టుబడులతో రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరువుతున్నాయని, ఈ పరిణామం తమలాంటి యువకులకు ఎంతో ఉపయోగకరమన్నారు. పార్టీలో నూతనంగా చేరిన తాము వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని, వేములవాడ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ బీఆర్‌ఎస్ నాయకులుఎ మామిడిపెల్లి రవి, జీవన్ రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

# కనుల పండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు



ఆండాళమ్మ అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించేదుకు వస్తున్న పద్మశాలీయులు

- ఆండాళమ్మ వారికి ఓడిబియ్యం సమర్పణ
- వందలాదిగా తరలివచ్చిన భక్తులు
- పట్టువస్త్రాలు సమర్పించిన పద్మశాలీ కులస్తులు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 27: సిరిసిల్లలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం హోమం, ఆండాళమ్మ వారికి ఓడిబియ్యం సమర్పించే కార్యక్రమం వేదమంత్రాల మధ్య జరిగింది. మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పొన్న వాహనంపై శ్రీవారిని మూడవీధుల గుండా ఊరేగించారు. కాగా, పద్మశాలీయుల ఇంటి ఆడబిడ్డగా భావించే పద్మావతి అమ్మవారు, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామికి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక మార్కండేయ ఆలయం నుంచి పద్మశాలీ అనుబంధ సంఘాల నాయకులు మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆండాళమ్మకు ఓడిబియ్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, మండల సత్యం, గాజుల బాలయ్య, తదితరులు ఉన్నారు.

### నేడే రథోత్సవం..

సిరిసిల్ల శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం(జాతర) కనులపండువగా జరుగనుంది. ఉదయం 6నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రథంపై శ్రీ స్వామివారి దర్శనం, మొక్కుల చెల్లింపులు, మధ్యాహ్నం 2గంటలకు రథంపై శ్రీ వారి ఊరేగింపు (చంద్రగ్రహణం ఉన్నందున రథోత్సవం, ఊరేగింపు) మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం కానున్నది. సాయంత్రం 5గంటలకు ఆలయం మూసివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. లక్షకు పైగా జాతరకు హాజరుకానున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.